

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 03-09-2026 | సంపుటి - 31 | సంచిక - 101 | రూ : 4 | పేజీలు: 8

## రాహుల్‌ను ప్రధాని చేయాలన్న
# వైఎస్ చివరి కోరికను నెరవేరుద్దాం

### పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

- ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు డా.వైఎస్ఆర్ అవార్డు ప్రదానం




దిల్లీ: ''నాడు రెండోసారి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన జీవిత లక్ష్యమని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించారు. ఆ చివరి కోరిక నెరవేరకుండానే అందరికీ దూరమయ్యారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్లచట్టాలను కేంద్రం వెనక్కు తీసుకొనేలా చేసి ప్రధానితో క్షమాపణలు చెప్పిస్తానని ప్రకటించిన రాహుల్‌గాంధీ ఆ పని చేసి చూపించారు. ఈ రోజు ప్రజలు కష్టాల్లో ఉన్నారు. వారికి అండగా తరువాయి 2లో



## కుట్టు మిషన్‌ల ప్రొక్యూర్‌మెంట్ 7లోగా పూర్తిచేయండి

- ఉన్నతాధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు

హైదరాబాద్: మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం కింద ప్రొక్యూర్‌మెంట్ ఈ నెల 7లోగా పూర్తిచేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కల్యాణలక్ష్మి పథకంపై హైకోర్టు స్టే ఎత్తివేసినందున పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని తరువాయి 2లో

### ఒక్క హామీకీ
## పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదు

- మరో 825 రోజుల తర్వాత ప్రజలు కాంగ్రెస్‌ను గద్దె దించుతారు
- వెయ్యి రోజుల పాలనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



2లో

## చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరి

- అక్రమ దత్తతల్లో అసలైన తల్లిదండ్రుల గుర్తింపులో పోలీసుల వైఫల్యం: హైకోర్టు
- శిశు సంక్షేమంపై ఆన్‌లైన్‌లో వివరాలిచ్చిన ముగ్గురు అధికారులు

2లో



## రామమందిర ట్రస్టులో కీలక మార్పులు..
# ముగ్గురు కొత్త సభ్యుల నియామకం

- అయోధ్య రామమందిర ట్రస్టులోకి కొత్త సభ్యులు
- విరాళాల అవకతవకల ఆరోపణల నేపథ్యంలో పరిపాలన పునర్వ్యవస్థీకరణ
- చివరి దశకు చేరుకున్న ట్రస్టు తొలి సీఈఓ నియామకం ప్రక్రియ
- ఆలయ నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల కోసం సీఈఓ పోస్టు ఏర్పాటు



2లో



2లో

### సిక్కింలో 40 ప్రమాదకర
## సరస్సులు గుర్తింపు

- సిక్కింను వెంటాడుతున్న హిమ సరస్సుల ముప్పు
- రాష్ట్రంలో 40 ప్రమాదకర సరస్సులను గుర్తించిన అధికారులు
- వీటిలో 7 అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- నేపాల్ వరదల నేపథ్యంలో అప్రమత్తమైన యంత్రాంగం
- సరస్సులపై శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించిన ప్రభుత్వం

## నా జీవితంలో మీరే ఫస్ట్ హీరో

### చిరంజీవి పోస్టుపై పవన్ భావోద్వేగ స్పందన

- తండ్రి స్థానంలో నిలిచి దారి చూపారని కొనియాడిన పవన్ కల్యాణ్
- చిన్నప్పటి నుంచి తనపై చూపిన విశ్వాసం, మద్దతు ఎంతో ప్రత్యేకం అని వెల్లడి
- మీ ఆశీస్సులతో ముందుకు సాగుతానంటూ అన్నయ్యకు ధన్యవాదాలు



2లో

## ఇస్తాంబుల్ తీరంలో రెండు టర్కీ నౌకల ఢీ

### 10 మంది సిబ్బంది ఆచూకీ గల్లంతు



- మర్మరా సముద్రంలో ఘోర నౌకా ప్రమాదం
- తెల్లవారుజామున 3 గంటలకు ఢీకొన్న వాణిజ్య నౌకలు
- ఒక నౌక మునిగిపోయి ఉండవచ్చని భావిస్తున్న అధికారులు

2లో

### సైబర్ సెక్యూరిటీలో గూగుల్ ముందడుగు..
'జెమిని 3.8 ఫ్లాష్ సైబర్' విడుదల

2లో

## గుడ్ల ధరలకు 'ఈ20' సెగ..

### ఏడాదిలో 40 శాతం పెరిగిన రేట్లు

- ఏడాదిలో 35 నుంచి 40 శాతం మేర పెరిగిన కోడిగుడ్ల ధరలు
- కోడి దాణా మొక్కజొన్నను ఇథనాల్ తయారీకి తరలించడమే ప్రధాన కారణం
- ప్రభుత్వ ఈ20 ఇంధన విధానంతో పెరిగిన మొక్కజొన్న కొరత
- శీతాకాలంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా
- ఉల్లి, బెల్లం వంటి నిత్యావసరాల ధరలు కూడా పైపైకి

దేశంలో కోడిగుడ్ల ధరలు సామాన్యులకు భారాన్ని కలిగిస్తున్నాయి. గత ఏడాది కాలంలో గుడ్ల ధరలు ఏకంగా 35 నుంచి 40 శాతం వరకు పెరిగాయని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) వెల్లడించింది. ఇటీవలి వరకు ఫామ్ వద్దే ఒక్కో గుడ్డు ధర రూ. 7 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో అది రూ. 8 నుంచి రూ. 9కి చేరింది. రాబోయే శీతాకాలంలో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో, ధరలు ఇంకా పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈ20' ఇంధన విధానమే



ప్రధాన కారణమని తెలుస్తోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపాలన్న లక్ష్యంతో మొక్కజొన్నను భారీగా వినియోగిస్తున్నారు. కోళ్ల దాణా తయారీ వ్యయంలో 65 నుంచి 70 శాతం మొక్కజొన్నదే కావడం తరువాయి 2లో

### భారత్‌లో ఏఐ ఉద్యోగాలకు భారీ డిమాండ్..
# రెండేళ్లలో 23 శాతం పెరిగిన వేతనాలు

- 2024-26లో 23 శాతం పెరిగిన ఏఐ ఉద్యోగాల జీతాలు
- బెంగళూరులో ఏఐ ఉద్యోగాలకు అత్యధిక వేతనాలు
- వేగంగా ఎదుగుతున్న మార్కెట్‌గా హైదరాబాద్
- సైబర్ సెక్యూరిటీలో రూ.97.81 లక్షల వరకు వేతనం
- గతేడాది 1 శాతం తగ్గిన ఐటీ, ఐటీ సర్వీసెస్ జీతాలు




భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగంలో పనిచేసే ఉద్యోగుల జీతాలు 2024 నుంచి 2026 మధ్య ఏకంగా 23 శాతం పెరిగాయి. అదే సమయంలో కొన్ని సంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల్లో వేతనాలు తగ్గినట్లు ఉద్యోగాల వేదిక 'ఫౌండిట్' నివేదిక వెల్లడించింది. 2025లో ఏఐ ఉద్యోగాల జీతాలు ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగాయి. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లలో 9 శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈకామర్స్ రంగాల్లో జీతాలు తగ్గాయి. ఐటీ సర్వీసెస్‌లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. తరువాయి 2లో

# రాహుల్‌ను ప్రధాని చేయాలన్న వైఎస్ చివరి కోరికను నెరవేరుద్దాం

ఢిల్లీ: ''నాడు రెండోసారి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన జీవిత లక్ష్యమని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించారు. ఆ చివరి కోరిక నెరవేరకుండానే అందరికీ దూరమయ్యారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్లచట్టాలను కేంద్రం వెనక్కు తీసుకొనేలా చేసి ప్రధానితో క్షమాపణలు చెప్పిస్తానని ప్రకటించిన రాహుల్‌గాంధీ ఆ పని చేసి చూపించారు. ఈ రోజు ప్రజలు అక్కడే ఉన్నారు. వారికి అండగా నిలవాల్సిన చారిత్రక సమయంలో ఈ దేశానికి రాహుల్‌గాంధీ లాంటి నాయకుడు అవసరం. వైఎస్ చివరి కోరికను నెరవేర్చాలంటే మనం అందరం మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వచ్చే రెండేళ్లు కష్టపడి పనిచేయాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ వైఎస్‌ఆర్ డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డ్ 2026'ను డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ప్రదానం చేసే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బుధవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ప్రాంగణంలోని మావలంకర్‌హాల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ''దేశ తొలి ప్రధాని నెహ్రూ సాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎస్సారెస్పీ లాంటి చారిత్రక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తర్వాత ఇందిరాగాంధీ స్వామినాథన్ కమిషన్‌ను నియమించి ఆ నివేదిక ఆధారంగా రైతుకు కనీస మద్దతు ధర కల్పించే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దేశప్రజలందరికీ ఆహారభద్రత కల్పించాలన్న లక్ష్యంతో దానికి చట్టబద్ధత కల్పించిన ఘనత సోనియాగాంధీకి దక్కుతుంది. వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకున్న వైఎస్ రాజశేఖరరెడ్డి 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజాప్రస్థానం పేరుతో పాదయాత్రచేసి పేదల కష్టాలు తెలుసుకున్నారు. రైతులకు ఉచిత కరెంటు మాట ఇచ్చి 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి సంతకం ఆ ఫైల్‌పైనే చేశారు. ఆనాడు రూ.1,300 కోట్ల రైతుల విద్యుత్తు బకాయిలు రద్దుచేయడమే కాకుండా వేల మంది రైతులపై పెట్టిన అక్రమ కేసులను తొలగించి రైతులగుండెల్లో రాజశేఖరరెడ్డి శాశ్వతంగా నిలిచిపోయారు. నాడు రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాణహితచేవెళ్ల, ఎస్సెల్బీసీ సొరంగమార్గాలు ఈరోజు ఆగిపోయి ఉన్నాయి. క్యాబినెట్ సహచరులతో కలిసి కష్టపడి వాటిని పూర్తిచేసి వైఎస్ ఆశయాలను నెరవేరుస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

* **కాంగ్రెస్‌ను రెండుసార్లు అధికారంలోకి తేవడంలో వైఎస్‌ది కీలకపాత్ర: ఖర్గే**

మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ''రాజశేఖరరెడ్డి పేదలకు వడ్డీలేని రుణాలు, రైతులకు ఉచిత విద్యుత్తులాంటి ఎన్నో పథకాలు తెచ్చారు. ఇప్పుడు మనం వాటినే గ్యారెంటీలు అంటున్నాం.

### గుడ్ల ధరలకు 'ఈ20' సెగ..
## ఏడాదిలో 40 శాతం పెరిగిన రేట్లు

దేశంలో కోడిగుడ్ల ధరలు సామాన్యులకు భారాన్ని కలిగిస్తున్నాయి. గత ఏడాది కాలంలో గుడ్ల ధరలు ఏకంగా 35 నుంచి 40 శాతం వరకు పెరిగాయని నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) వెల్లడించింది. ఇటీవలి వరకు ఫామ్ వద్దే ఒక్కో గుడ్డు ధర రూ. 7 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో అది రూ. 8 నుంచి రూ. 9కి చేరింది. రాబోయే శీతాకాలంలో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో, ధరలు ఇంకా పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈ20' ఇంధన విధానమే ప్రధాన కారణమని తెలుస్తోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపాలన్న లక్ష్యంతో మొక్కజొన్నను భారీగా వినియోగిస్తున్నారు. కోళ్ల దాణా తయారీ వ్యయంలో 65 నుంచి 70 శాతం మొక్కజొన్నదే కావడం గమనార్హం. దేశీయంగా ఉత్పత్తవుతున్న మొక్కజొన్నలో దాదాపు 37 శాతాన్ని ఇథనాల్ తయారీ పరిశ్రమలకే మళ్లించడంతో, కోళ్ల పరిశ్రమకు దాణా కొరత ఏర్పడి ధరలు గణనీయంగా పెరిగాయి. గత మూడేళ్ల కాలంలో టన్ను మొక్కజొన్న ధర రూ. 14,000 నుంచి రూ. 26,500కి పెరిగింది. ముఖ్యంగా గత ఐదు నెలల్లోనే ధరలు 20 శాతం పెరగడం గమనార్హం. 2024లో 6 మిలియన్ టన్నుల మొక్కజొన్నను ఇథనాల్ తయారీకి వినియోగించగా, ప్రస్తుతం ఆ వినియోగం 17 మిలియన్ టన్నులకు చేరింది. ఇథనాల్ విధానంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు, కోళ్ల మరణాల రేటు పెరగడం వంటివి కూడా ఇటీవల ధరల పెరుగుదలకు ఇతర కారణాలని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఉల్లి, బెల్లం వంటి ఇతర నిత్యావసరాల ధరలు కూడా భారమవ్వడం సామాన్య వినియోగదారులపై అదనపు ఒత్తిడిని కలిగిస్తోంది.

# ఒక్క హామీకీ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదు

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులయినా ఒక్క హామీకి కూడా పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతోరేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలు మరో 825 రోజుల కోసం ఎదురు చూస్తున్నారని, తర్వాత కాంగ్రెస్‌ను గద్దె దించుతారని పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బుధవారం కేంద్ర మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్ల కోసం రోడ్డెక్కే రావడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పొట్ట కొడుతోంది. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వడం లేదు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైంది? వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు ఎందుకు ఇవ్వడం లేదు? యువతకు ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, రూ.4 వేల నిరుద్యోగ భృతి, పేద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు హామీలు ఏమయ్యాయి? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.14 వేల కోట్లు పేరుకుపోయాయి. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి.. అరకొరగానే చేశారు. పది పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి.. తర్వాత వరికే అన్నారు. భూమి ఉన్న రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఈ బకాయిలే సుమారు రూ.57 వేల కోట్లు ఉన్నాయి. భూములను నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తమ హక్కుల కోసం తిరిగే పరిస్థితికి తెచ్చారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబ సభ్యులకు పింఛను హామీ ఏమైంది? బీసీ సంక్షేమం కోసం ఏటా రూ.20 వేల కోట్లు ఇస్తామన్నారు. మూడేళ్లలో రూ.10 వేల కోట్లు కూడా సక్రమంగా కేటాయించలేదు. ఈ హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నాడు భారాస, నేడు కాంగ్రెస్ ఒకే రకమైన ఆలోచనతో 12 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయి'' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరి

హైదరాబాద్: రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా... చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని స్పష్టంచేసింది. రెండు నెలల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లు ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని ప్రశ్నించింది. డీఎన్ఏ నమూనాల సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి పూర్తి నివేదికను వారంలోగా నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీలు దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది.

### రామమందిర ట్రస్టులో కీలక మార్పులు..
## ముగ్గురు కొత్త సభ్యుల నియామకం

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం నిర్వహించిన సమావేశంలో ట్రస్టుకు ముగ్గురు కొత్త సభ్యులను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా, ఆలయ నిర్వహణ కోసం తొలిసారిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నియామకాన్ని కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు. నూతనంగా నియమితులైన సభ్యుల్లో ఢిల్లీకి చెందిన మహేశ్ భగచంద్కా, అయోధ్యకు చెందిన మదన్ మోహన్ పాండే, షికోహాబాద్ వాసి నిర్మలా యాదవ్ ఉన్నారు. వీరిలో మహేశ్ భగచంద్కా, దివంగత విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అగ్రనేత అశోక్ సింఘాల్‌కు సమీప బంధువు కావడం గమనార్హం. ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేయడం, మరో సభ్యుడు విమలేంద్ర మోహన్ మిశ్రా కన్నుమూయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఆరంభంలో ఆలయ విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు ట్రస్టు పునర్వ్యవస్థీకరణకు పూనుకుంది. ఇందులో భాగంగానే ఈ తాజా నియామకాలు జరిగాయి. ఆలయ దైనందిన కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు తొలిసారిగా సీఈఓ పదవిని అందుబాటులోకి తెచ్చారు. ఈ పోస్టుకు సుమారు 5,500కు పైగా దరఖాస్తులు రాగా, త్రిసభ్య ఎంపిక కమిటీ ముగ్గురు పేర్లను ట్రస్టుకు సిఫార్సు చేసింది. వీరిలో ఒకరిని సీఈఓగా ఎంపిక చేసే ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది. బహుశా సెప్టెంబరు 3వ తేదీన సీఈఓ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## నా జీవితంలో మీరే ఫస్ట్ హీరో.. చిరంజీవి పోస్టుపై పవన్ భావోద్వేగ స్పందన

తన పుట్టినరోజు సందర్భంగా అన్నయ్య, మెగాస్టార్ చిరంజీవి అందజేసిన శుభాకాంక్షలకు జనసేనాని, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో చిరంజీవి స్థానం ఎంతటిదో వివరిస్తూ బుధవారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక భావోద్వేగభరితమైన పోస్టును పంచుకున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ సందేశం మరోసారి చాటిచెప్పింది. ''మీ ప్రేమ, ఆప్యాయత, శుభాకాంక్షలకు హృదయపూర్వక ధన్యవాదాలు అన్నయ్యా. చిన్నతనం నుంచి నాపై మీరు చూపిన విశ్వాసం, మద్దతు నా జీవితంలో ఎంతో ప్రత్యేకం. తండ్రి స్థానంలో నిలిచి నాకు మార్గనిర్దేశం చేశారు. నా జీవితంలో మీరే తొలి హీరో'' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ''జీవితంలో గమ్యం తెలియని రోజుల్లో నాకు దిశానిర్దేశం చేసిన మీ మాటలు, ఆలోచనలు నేటికీ నాలో సజీవంగా ఉన్నాయి. కుటుంబం పట్ల మీకున్న మమకారం, సమాజం పట్ల మీ బాధ్యత, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే మీ తపనను చూస్తూ పెరిగాను. ఆ అనుభవాలే నా ఆలోచనలకు దిశానిర్దేశం చేశాయి. మీరు నా జీవితంలో ఎప్పటికీ మార్గదర్శిగానే ఉంటారు. మన ఇలవేల్పు శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులు, మీ దీవెనలతో ముందుకు సాగుతాను'' అని ఆయన తన పోస్ట్‌లో వివరించారు. అంతకుముందు, చిరంజీవి తన తమ్ముడు పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ సందేశాన్ని ఉంచారు. ఉప ముఖ్యమంత్రిగా గ్రామాభివృద్ధి, గిరిజన సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై పవన్ పనిచేస్తున్న అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. పిఠాపురం ప్రజలను తన సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారని కొనియాడారు. ప్రజా సేవలో నిమగ్నమైన పవన్ కల్యాణ్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు చిరంజీవి పేర్కొన్నారు.

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు

పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన (గ్లేసియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్) సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను 'అత్యంత ప్రమాదకర' జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది. ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి గట్టు తెంచుకున్నా భారీ విపత్తు సంభవించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ తాంబే మాట్లాడుతూ, కొన్ని సరస్సులపై ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సరస్సుల లోతు, నీటి నిల్వ సామర్థ్యం, మంచు కరిగే విధానం, కొండచరియలు విరిగిపడే ముప్పు వంటి అంశాలను నిపుణులు అంచనా వేస్తున్నారని ఆయన వివరించారు. ఆగస్టు 26న నేపాల్‌లో హిమ సరస్సు విచ్ఛిన్నం కావడం వల్ల సంభవించిన వరదల్లో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 4,000 మంది గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సిక్కింలో అటువంటి విపత్తు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

## భారత్‌లో ఏఐ ఉద్యోగాలకు భారీ డిమాండ్.. రెండేళ్లలో 23 శాతం పెరిగిన వేతనాలు

భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగంలో పనిచేసే ఉద్యోగుల జీతాలు 2024 నుంచి 2026 మధ్య ఏకంగా 23 శాతం పెరిగాయి. అదే సమయంలో కొన్ని సంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల్లో వేతనాలు తగ్గినట్లు ఉద్యోగాల వేదిక 'ఫౌండిట్' నివేదిక వెల్లడించింది. 2025లో ఏఐ ఉద్యోగాల జీతాలు ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగాయి. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లలో 9 శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈ కామర్స్ రంగాల్లో జీతాలు తగ్గాయి. ఐటీ సర్వీసెస్‌లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. ఏఐ రంగంలో 03 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు ఏడాదికి రూ.8.87 లక్షల నుంచి రూ.15.41 లక్షల వరకు వేతనం లభిస్తోంది. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి ఇది రూ.70.99 లక్షల నుంచి రూ.89.24 లక్షల వరకు చేరుతోంది. ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన కంపెనీలు, ఏఐ స్టార్టప్‌లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఎక్కువగా ఉండటంతో దేశంలో అత్యధిక జీతాలు అందించే మార్కెట్‌గా బెంగళూరు నిలిచింది. అక్కడ సీనియర్ ఏఐ నిపుణులకు రూ.61.70 లక్షల నుంచి రూ.91.25 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ఢిల్లీ, ముంబైతో పోలిస్తే ఇది దాదాపు 1015 శాతం ఎక్కువ. హైదరాబాద్ కూడా వేగంగా ఎదుగుతున్న మార్కెట్‌గా నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీలో సీనియర్ ఉద్యోగులకు రూ.97.81 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వేతన పరిమితి. ఇదే సమయంలో ఐటీ, ఐటీ సర్వీసెస్‌లో 03 ఏళ్ల అనుభవం ఉన్నవారి జీతాలు రూ.2.68 లక్షల నుంచి రూ.5.08 లక్షల వరకు ఉన్నాయి. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి రూ.57.55 లక్షల నుంచి రూ.72.13 లక్షల వరకు లభిస్తున్నాయి. ఈ రెండు విభాగాల్లో గతేడాది జీతాలు 1 శాతం తగ్గాయి. నైపుణ్యాలకు అనుగుణంగానే భవిష్యత్తులో జీతాలు పెరుగుదల ఉంటుందని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి వ్యాపార అవసరాలకు నేరుగా ఉపయోగపడే నైపుణ్యాలకు కంపెనీలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు.

## సైబర్ సెక్యూరిటీలో గూగుల్ ముందడుగు..

టెక్ దిగ్గజం గూగుల్ సైబర్ సెక్యూరిటీ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. తమ అత్యంత శక్తివంతమైన సైబర్ సెక్యూరిటీ ఏఐ మోడల్ "జెమినీ 3.8 ఫ్లాష్ సైబర్"ను పరిచయం చేస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. సైబర్ భద్రతకు సంబంధించిన లోపాలను అత్యంత వేగంగా గుర్తించి, వాటిని అంతే వేగంగా సరిదిద్దడంలో ఈ మోడల్ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించిన పరిశ్రమల ప్రామాణిక 'సైబర్‌జిమ్' బెంచ్‌మార్క్‌లో ఇది 86.2 శాతం స్కోరును సాధించిందని ఆయన తెలిపారు. అదేవిధంగా, లోపాలను సరిచేసే విషయంలో 'CWEబెంచ్' పరీక్షల్లో 47.2 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. గూగుల్ అందిస్తున్న ఇతర ఫ్లాష్ మోడల్స్ తరహాలోనే ఇది కూడా వేగవంతమైన పనితీరును, తక్కువ ఖర్చుతో కూడిన లభ్యతను కలిగి ఉంటుందని సుందర్ పిచాయ్ వివరించారు.

## ఇస్తాంబుల్ తీరంలో రెండు టర్కీ నౌకల ఢీ.. 10 మంది సిబ్బంది ఆచూకీ గల్లంతు

టర్కీలోని ఇస్తాంబుల్ తీరం మార్మరా సముద్రంలో ఘోర నౌకా ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో టర్కీ పతాకంతో ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక నౌకకు చెందిన 10 మంది సిబ్బందితో సంబంధాలు తెగిపోవడంతో వారి ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి.



* **ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు:**

నౌకల వివరాలు: కొకేలీ నుంచి అలియాగా వెళ్తున్న 'అల్సు' (Alsu) అనే కెమికల్ ట్యాంకర్, ఇస్కెందరున్ ఓడరేవు నుంచి కొరాడెనిజ్ ఎరెగ్లీ వైపు వెళ్తున్న 'తుగ్బర్క్ ఇమామోగ్లు' (Tugberk Imamoglu) అనే బల్క్ క్యారియర్ నౌకలు సిలివ్రి తీరానికి 18 నాటికల్ మైళ్ల దూరంలో ఢీకొన్నాయి. కనిపించకుండా పోయిన సిబ్బంది: ప్రమాదం జరిగిన అనంతరం 'అల్సు' నౌకకు ఎటువంటి తీవ్ర నష్టం జరగనప్పటికీ, 'తుగ్బర్క్ ఇమామోగ్లు' నౌకతో పాటు అందులోని 10 మంది సిబ్బంది ఆచూకీ పూర్తిగా లభ్యం కాకుండా పోయింది. అధికారులు వారి మొబైల్ ఫోన్లకు కాల్స్ చేసినా ఎలాంటి సమాధానం రాలేదు. మునిగిపోయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సముద్ర ఉపరితలంపై నౌకకు చెందిన లైఫ్‌సేవింగ్ జాకెట్లు, పరికరాలు కొట్టుకొచ్చినట్లు గుర్తించారు. ప్రమాద స్థలి వద్దకు 14 రెస్క్యూ నౌకలు, కోస్ట్ గార్డ్ హెలికాప్టర్లను పంపి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ దగా పాలనపై రణరంగంగా మారిన కుత్బుల్లాపూర్ చౌరస్తా

* **ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రేవంత్ సర్కార్ ని విడిచిపెట్టే ప్రసక్తే లేదు**
* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి: రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రేవంత్ సర్కార్ ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసనలో భాగంగా కుత్బుల్లాపూర్ లో మొదటి రోజు బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ చౌరస్తా లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మీడియా ముఖంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి తమ నిరసనను తెలియజేసి ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద్ ఆధ్వర్యంలోపెద్ద ఎత్తున నిర్వహించిన ధర్నాతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ శ్రేణులు గర్జించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఏ విధంగా పాల్గొన్నారో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగాపాలనపై మరో మారు కదం తొక్కిన గులాబీ దండును చూస్తుంటే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే రేవంత్ సర్కార్ కెసిఆర్ గారిపై వ్యక్తిగత దూషణలకు దిగుతూ ప్రజలను దారిమళ్లిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై, ప్రజలకు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ పార్టీ సమర శంఖం పూరించిందన్నారు. అబద్దుల పునాదులపై ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో ఇస్తానన్న హామీలు 1000 రోజులైనా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తా ఉన్నారన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు స్కూటీలు ఇస్తా అన్నడు. విద్యాభరోసా కార్డు అన్నడు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తాం, జాబ్ క్యాలెండర్ అన్నడు.కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తా అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు నీ ముఖం ఎక్కడ పెట్టుకుంటవ్ రేవంత్ రెడ్డి అని అన్నారు. నీ ముఖాన్ని, మీ కాంగ్రెస్ నాయకులను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నడు నమ్మలేదు, అందుకే ఢిల్లీ నుంచి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పిలిపించుకొని దొంగ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డి తన అనుయాయులతో స్క్వేర్ ఫీట్ కు వంద రూపాయలను వసూలు చేసే విషయాన్ని ప్రజలు గమనిస్తూ ఉన్నారన్నారు. నువ్వు నందో, పందో, పందికొక్కొ అసెంబ్లీలో తెలుస్తామన్నారు. కేసీఆర్ ని రాజీనామా చేయాలని ప్రజలను కోరాలని కాంగ్రెస్ నాయకులను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయమంటున్నవ్ కదా రేవంత్ రెడ్డి, మీ కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లితే బట్టలిప్పి కొట్టడం ఖాయమన్నారు. నువ్వు వెయ్యి రోజుల్లో ప్రజలకు ఏమి చేశావో చెప్పు... మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు క్షమించరన్నారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి.... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ మండలంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహాసిల్దార్ లక్ష్మణ్ బాబు ,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కు ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :కొత్తగూడెం పట్టణంలో సూర్యా ప్యాలెస్ సెంటర్ లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి డిసిసి అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న తోపాటు జిల్లా కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, అధికార ప్రతినిధి వైస్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు.పెద్దబాబు, కొదుమూరి శ్రీనివాసరావు, మంద హనుమంతు, జానీ పాషా, పూనెం శ్రీనివాస్, పరమేష్ యాదవ్, వివిధ కార్పోరేటర్స్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కొత్త గూడెం పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన జబ్బా సాగర్ , జాతోత్ సురేష్ అనే వ్యక్తులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కొత్తగూడెం 2వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రవికుమార్ విచారణ జరిపి, ఇద్దరు నిందితులకు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులతోపాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ప్రజావాణితో రైతు కుటుంబానికి ఊరట

* **జిల్లా కలెక్టర్ జోక్యంతో ఐదేళ్ల దారి సమస్యకు పరిష్కారం**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి లో చేసిన ఫిర్యాదుతో శామీర్పేట గ్రామానికి చెందిన రైతు కుటుంబం ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న వ్యవసాయ భూమి దారి సమస్యకు పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలతో రెవెన్యూ, సర్వే అధికారులు భూ రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరించారు. శామీర్పేట గ్రామంలోని సర్వే నంబర్ 21/ఎ/2/ఆ పరిధిలోని వ్యవసాయ భూమికి సుమారు 60 ఏళ్లుగా వినియోగంలో ఉన్న దారిని పక్క భూముల యజమానులు మూసి వేయడంతో ఐదేళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతు కుటుంబానికి చెందిన తాళ్ల దివ్య ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికా రులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు పాత పహాణీలు, భూ రికార్డులు, సర్వే వివరాలను పరిశీలించి ఐదు గుంటల భూమిని భూ భారతి పహాణీలో నమోదు చేసి, వ్యవ సాయ భూమికి దారి కల్పించేలా చర్య లు చేపట్టారు. దీంతో ఐదేళ్లుగా కొనసా గుతున్న సమస్యకు పరిష్కారం లభించింది. సమస్య పరిష్కారానికి సహక రించిన రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖ అధికారులకు బాధిత కుటుంబం కృత జ్ఞతలు తెలిపింది. ముఖ్యంగా ప్రజావా ణిలో తమ ఫిర్యాదును స్వీకరించి సమ స్యను పరిష్కరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు తాళ్ల దివ్య, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ కె.హరిత**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షల వైపు సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం ఇందిరనగర్ లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పట్టికలు, తరగతి గదులు, విద్యాబోధన తీరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల గది, రోగులు చికిత్స పొందుతున్న గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చిన్నచిన్న కారణాలతో రోగులను ఇతర ప్రాంతాలకు సిఫారసు చేయకూడదని తెలిపారు. నెలలు నిండిన గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండి సుఖప్రసవానికి చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.30 లక్షలతో జగదాంబ సేవాలాల్ ఆలయ పునర్నిర్మాణం

* **శివుని తండ 2 (సీతా భాయి తండ) లో ఘనంగా శంకుస్థాపన**
* **పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని శివుని తండ 2 (సీతా భాయి తండ) లో గ్రామంలో శ్రీ జగదాంబ సేవాలాల్ దేవాలయ పునర్నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ.30 లక్షలతో చేపట్టనున్న ఆలయ పునర్నిర్మాణ పనులకు ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను తెలుసుకున్న ఎమ్మెల్యే, పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు తమ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రహదారి, మొబైల్ నెట్వర్క్, త్రీ ఫేస్ విద్యుత్, తాగునీరు, భూముల పట్టాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ బియ్యం వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, వీరేగం తండ నుంచి శివుని తండ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. శివుని తండలో మొబైల్ నెట్వర్క్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రేషన్ బియ్యం కోసం గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన, ఇకపై గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా అదే గ్రామంలో రేషన్ బియ్యం అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేయిస్తానని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తా, బంజారా ప్రజలకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను కూడా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ కుల ధ్రువీకరణ పత్రాలను ఓబీసీ కేటగిరీలో మార్చే అంశంపై సమస్యలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, బంజారా ప్రజలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తాననిఅన్నారు. భూముల పట్టాల కోసం కృషి,గ్రామంలో ఎక్కువ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయని, భూములకు సంబంధించిన పట్టాల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారికి భూముల పట్టాలు అందేలా ప్రభుత్వ స్థాయిలో కృషి చేస్తానని, అవసరమైతే ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి ప్రజల తరఫున పోరాడుతానని హామీ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరగడం, గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీలు ఇవ్వడంతో శివుని తండ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో బీజేపీ భారీ ధర్నా

* **22ఏ భూముల సమస్యలపై ఎంపీల గర్జన**



మెదక్ జిల్లా నర్సాపూర్, (ప్రజా స్ఫూర్తి ): నర్సాపూర్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్యపై బీజేపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. 22ఏ జాబితాలో ఉన్న భూముల పూర్తి వివరాలను వెంటనే బహిర్గతం చేసి, అర్హులైన రైతులు, పేదలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.ధర్నాకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 22ఏ భూముల విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన అంటూ సంబరాలు చేసుకుంటున్నారన్నారు. రైతుల భూ సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పెద్ద ఎత్తున భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. 15 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను సైతం 22ఏ పరిధిలోకి తీసుకొచ్చారని విమర్శించారు. అర్హులైన భూములను సెప్టెంబర్ 7లోగా 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ధరణి వచ్చిన తర్వాత భూముల రికార్డుల్లో అనేక మార్పులు జరిగాయని ఆరోపించారు. కాస్తుదారు, భూయజమాని వివరాలు తొలగించి కొన్ని భూములను ప్రభుత్వ భూములుగా మార్చారని విమర్శించారు. పేదలు, రైతుల భూ హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17 వ వర్ధంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం సూర్యాపేట పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు అంజద్ ఆలి, ఎలిమినేటి అభినయ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతమల్ల రమేష్, బైరు వెంకన్న, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, గుణగంటి సతీష్,పారుక్,రాపర్తి శ్రీనివాస్, బండారు వెంకన్న , అనంతుల యాదగిరి, పంతంగి దశరథ , దివ్య, నీడ్స్ సాజిద్ , సత్యనారాయణ రెడ్డి, పిడమర్తి శంకర్, నరేందర్ నాయుడు యూత్ కాంగ్రెస్ నాయకులు సమీర్, అనిల్ , శివ , అశోక్ , పవన్, సుధీర్, వినయ్, మహేష్, లక్ష్మణ్, వంశీ, శివమణి, డి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



కీతవారిగూడెం ప్రజాస్ఫూర్తి : దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కీతవారిగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కే. చాంద్ మియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కీత సోమయ్య ప్రధాన కార్యదర్శి నర్సింగు వెంకటేశ్వర్లు మాజీ అధ్యక్షులు జుట్టుకొండ లక్ష్మీనారాయణ టీ. కృష్ణమూర్తి మేళ్లచెరువు రామ్మూర్తి ముత్తినేని కోటేశ్వరరావు పాలవెల్లి ముత్తయ్య ఓరుగంటి వెంకటరమణ కీత చిన మట్టయ్య కీత రామనాథం ఉపసర్పంచ్ చిత్తలూరి వీరస్వామి వార్డు సభ్యులు బండారు సైదులు ఎస్.కే. మీరా బండారు అంజయ్య గూడెపు వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నాయకులు మస్తాన్ బొల్లెపల్లి సైదులు తిరపయ్య గుండు సైదులు అనంత రాములు గూడెపు శ్రీను బండారు హుస్సేన్ కడప విక్కి గుండు వెంకన్న కొమరాజు నాగయ్య పటాన్ మదర్ సాబ్ తవిడబోయిన గోపయ్య గుండెపంగు నరేష్ తదితరులు కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ అభిమానులు అత్యధికంగాపాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 2బీహెచ్‌కే ఇళ్లపై కలెక్టర్ ఫోకస్

* **అర్హుల తుది జాబితా పారదర్శకంగా.. లక్కీ డ్రాతో ఎంపిక.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో 2బీహెచ్ కే ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి గా పారదర్శకంగా నిర్వహించి,అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా అధికారులను ఆదేశించారు.జి ల్లా సమీకృత కలెక్టరేట్ లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి గృహ నిర్మా ణ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన 1,137 రెండు పడక గదుల ఇళ్లకు సం బంధించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకా రం నిజమైన అర్హులనే ఎంపిక చేయా లని సూచించారు.L2 జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజల పరి శీలనకు ప్రదర్శించాలని, అర్హుల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాలో పరిగణన లోకి తీసుకోవాలని ఆదేశించారు.అనం తరం లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎం పికను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు.ఇళ్ల కేటాయింపు ప్రక్రియ లో ఎలాంటి అవకతవకలకు తావులే కుండా నిష్పక్షపాతంగా వ్యవహరించా లని అధికారులకు సూచించారు. సమా వేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది

*** ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిఅన్నారు. వలిగొండ మండలం మల్లేపల్లి గ్రామంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. రూ.40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజీ, రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా 10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి ఏఎంసిచైర్మన్ భీమా నాయక్, పిఏసిఎస్ చైర్మన్ గరిసే రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి ఉప సర్పంచ్ మలుగ మాధవి -వెంకటేష్, పిఏసిఎస్ వైస్ చైర్మన్, జంగారెడ్డి నాయకులు బత్తిని లింగయ్య బద్దం సంజీవరెడ్డి గుండు దానయ్య గౌడ్ కొండూరు భాస్కర్ గౌడ్ కాసుల వెంకన్న గౌడురెక్టర్స్, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం అభ్యున్నతిలో వైఎస్సార్ ది చారిత్రక పాత్ర

**డీసీసీ మైనారిటీ ఛైర్మన్ మాజిద్ అఫ్సర్.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ముస్లిం రిజర్వే షన్లు, సామాజిక-ఆర్థిక అభ్యున్నతికి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) చారి త్రక, కీలక పాత్ర పోషించారని జిల్లా డీ సీసీ మైనారిటీ ఛైర్మన్ మాజిద్ అఫ్సర్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజికంగా, విద్యాపరంగా వెనుక బడిన ముస్లిం వర్గాలకు 4 శాతం రిజ ర్వేషన్లు కల్పించే దిశగా చారిత్రక నిర్ణ యం తీసుకుందని గుర్తు చేశారు.దీంతో ముస్లిం యువతకు విద్య, ఉపాధి, అభి వృద్ధి అవకాశాలు మెరుగుపడ్డాయని తెలిపారు.

## పివిఎంఎస్ రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పారంపర్య వైద్యుల మహా సంఘం (పివిఎంఎస్) రాష్ట్ర మహాసభలకు అతిథిగా రావాలని కోరుతూ సర్పంచ్ పూణెం కృష్ణ దొరకు బుధవారం ఆహ్వాన పత్రికను అందించారు. భద్రాచలంలో ఈనెల 8, 9 ,10, తేదీలలో శ్రీ మార్కండేయ పద్మశాలి భవన్‌లో జరగనున్న రాష్ట్ర మూడవ మహాసభలకు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయనకు ఆహ్వాన పత్రికను అందించిన వారిలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, భద్రాద్రి జిల్లా కన్వీనర్ ఎ. సుగుణారావు, తూము రమేష్, దశరథ్ రజువా, కె. మహేందర్, తీగల రమేష్‌లు పాల్గొన్నారు.

## నర్సైపై అత్యాచారం, హత్యను ఖండించిన గిరిజన సంఘం

*** నిందితుడికి ఉరిశిక్ష విధించాలి**

*** రాష్ట్ర గిరిజన నాయకుడు.ఎల్. వెంకటేష్ నాయక్.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి :మహేశ్వరం తుక్కుగూడలో గిరిజన నర్స్ ఊకే శిరీషపై గత నెల చివరి వారంలో జరిగిన అత్యాచారం, హత్య ఘటనను గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన గిరిజన రాష్ట్ర నాయకుడు ఎల్. వెంకటేష్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారించి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలు నర్సులు, గిరిజన మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు గిరిజన సంఘం పోరాటం కొనసాగిస్తుందని వెంకటేష్ నాయక్ స్పష్టం చేశారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఎడ్ల కవిత



కూకట్‌పల్లి, ప్రజాస్ఫూర్తి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకురాలు ఎడ్ల కవిత సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నట్లు తెలిపారు.ప్రజా జీవితంలో మరింత చురుకుగా ముందుకు సాగాలని ఎడ్ల కవిత సతీష్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించినట్లు తెలిపారు.ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా ఎడ్ల కవిత సతీష్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం సంతోషంగా ఉందని,ఆయనతో ఆత్మీయంగా మాట్లాడటం మంచి అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాల్గొన్నారు.

## రైతులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

**: ఎమ్మెల్యే పల్లా**

*** సీఎం రేవంత్‌రెడ్డి పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర విమర్శలు.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభు త్వం మోసపూరిత పాలన సాగిస్తోందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, నిరుద్యోగులు తీ వ్రంగా నష్టపోతున్నారని విమర్శించా రు. తెలంగాణ సాధించుకున్నది రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అని, అయితే సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు నాయుడికి తెలంగాణను తాకట్టు పెడుతున్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తూ రాష్ట్ర రైతుల కు అన్యాయం చేస్తున్నారని విమర్శిం చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రైతు లకు అవసరమైన నీటిని విడుదల చే యకుండా, ప్రాజెక్టు వద్దకు వెళ్లి ప్రజల ను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుత న్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికా రం లోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని ప్రకటిం చినప్పటికీ, వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెర వేర్చలేదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శిం చారు.

## విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారు

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి ప్రజాస్ఫూర్తి: భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పరీక్షలకు సిద్ధమవుతున్న విధానం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి క్రీడలు, ఐటీ, సాంకేతికత, కళలు తదితర వివిధ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల విషయంలో విద్యార్థులు అనవసరమైన ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. పదో తరగతి జీవితంలో ఒక ముఖ్యమైన అడుగు మాత్రమేనని, పరీక్షల్లో ఆశించిన ఫలితం రాకపోయినా జీవితం ఆగిపోదని వారికి అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు, తరగతి గదులు, ఇతర మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఉందని తెలిపారు.మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మరుగుదొడ్ల తలుపులు తదితర వసతులు సక్రమంగా లేకపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.పాఠశాల కిచెన్, స్టోర్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌లో ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన ఆహారపదార్థాల నాణ్యత, గడువు తేదీలను తనిఖీ చేశారు. విద్యార్థులకు గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలు అందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి మాధవి , పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న జెల్ల, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు తొలగించిన పిదప డ్రైనేజీలు నిర్మించాలి




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15వ డివిజన్‌లో జాతీయ రహదారి పక్కన చేట్టిన డ్రెయినేజీ పనులకు విద్యుత్ స్తంభాలు ఆటంకంగా మారాయని రామవరం పరిరక్షణ కమిటీ సభ్యులు ఆరోపించారు. విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చిన పిదప డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ మేరకు బుధవారం కొత్తగూడెం కార్పొరేషన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందచేశారు. విద్యుత్ స్తంభాలను తొలగించకుండా అలాగే డ్రెయినేజీలను నిర్మించడం వల్ల అవి డ్రెయినేజీల మధ్యలో ఉంటున్నాయని, ఫలితంగా వర్షం వచ్చినప్పుడు నీటి ప్రవాహంలో చెత్త చెదారం విద్యుత్ స్తంభానికి ఆనుకుని పేరుకుపోతున్నాయని అన్నారు. ఇవి దుర్వాసన వెదజల్లడమే కాకుండా భవిష్యత్తులో డ్రెయినేజీ మూసుకుపోయే ప్రమాదం ఉందన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి చేపట్టిన డ్రెయినేజీలను ప్రణాళిక లేకుండా నిర్మించడంతో ప్రజాధనం వృథా అవుతుందని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు ముందు చూపుతో ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాదాసి రామ్మోహన్, చంద్రశేఖర్, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా ఉన్నారు.

## రాహుల్ గాంధీపై కేసు నమోదు కక్షసాధింపు చర్య

**: ఎమ్మెల్యే బొజ్జు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ పిలుపు మేరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, దేశ ప్రజల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక కేసులతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారని,దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతను ఏకం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీపై ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిరకాలుగా ఇబ్బందులకు గురిచేసినా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడబోరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని అన్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీ ఎంపీలు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయంలోఅధికారులకుమెమోరాండంసమర్పించారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని మెమోరాండంలో కోరారు.

## సోషల్ మీడియాలో ఓ ప్రజా ప్రతినిధిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ పై వేటు

సైబరాబాద్,ప్రజాస్ఫూర్తి: సోషల్ మీడియాలో ఒక ప్రజా ప్రతినిధి పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు గాను 2018 బ్యాచ్ కు చెందిన ఆర్మ్డ్ రిజర్వు పోలీస్ కానిస్టేబుల్ కె. అనిల్ పై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం సైబరాబాద్ సీఏఆర్నుంచి ఆర్డర్ టు సర్వ్ లో భాగం గా హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ లో విధులు నిర్వహిస్తున్న కె. అనిల్ సోషల్ మీడియాలో ప్రజా ప్రతినిధిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది.పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, వృత్తిపరమైన ప్రవర్తన, గౌరవప్రదమైన వ్యవహారశైలిని పాటించాల్సి ఉంటుందని సీపీ డా. ఎం. రమేష్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో కూడా పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించినందుకు గాను కె. అనిల్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు.

## వలిగొండలో ఘనంగా రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: వలిగొండ మండల కేంద్రంలో బుధవారం స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించడం జరిగింది. రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారుఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ వలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు నాయకులు బత్తిని లింగయ్య పబ్బు సురేందర్ చిలుకూరు సత్తిరెడ్డి గుండు దానయ్య గౌడ్ గంగదారి రాములు కాసుల వెంకన్న గౌడ్ మారగోని నరసింహ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:జనసేన సూర్యాపేట నియోజకవర్గం నాయకులు అజయ్ జనసేన , చైతన్య నాయుడు ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షులు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి బాణసంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ ఒక బలమైన శక్తిగా ఎదుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున అభిమాన సంఘం నాయకులు నరేందర్ నాయుడు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఎలుగురి రాంబాబు ,సూర్య ,హరి ,మల్లి, మోహన్, సతీష్, నవీన్, శివ సాయి, వెంకన్న, నజీర్ పాష తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల బదిలీలు తాత్కాలికంగా నిలిపివేయాలి



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యా సంవత్సరం మధ్యలో పోలీసు సిబ్బంది బదిలీలు చేపట్టకుండా తాత్కాలికంగా వాయిదా వేయాలని సైబరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ను కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.పిల్లల పాఠశాల ఫీజులు, అడ్మిషన్లు ఇప్పటికే పూర్తయినందున ప్రస్తుతం బదిలీలు జరిగితే పోలీసు సిబ్బంది ఆర్థికంగా, కుటుంబపరంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని కమిటీ సభ్యులు వివరించారు. పిల్లల విద్యకు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉన్నందున బదిలీలను కొంతకాలం వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే త్వరలో జరగనున్న గణేష్ ఉత్సవాల బందోబస్తు విధులను సమర్థంగా నిర్వహించేందుకు ప్రస్తుతం పోలీసు సిబ్బంది బదిలీలను నిలిపివేయడం అవసరమని కోరారు. దీనిపై కమిషనర్ డా. ఎం. రమేష్ సానుకూలంగా స్పందిస్తూ, వినతిని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) టి. అన్నపూర్ణ, ఐపీఎస్, ట్రెజరర్ జి. మల్లేశం, ఎస్ఐ, డైరెక్టర్లు ఎ. రాజేందర్, పీసీ, బి. బలవంత రెడ్డి, హెచ్‌సీ, సి. మల్లేశం, హెచ్‌సీ, పి. అశోక్, ఏఆర్‌పీసీ, జె. రాజిని, ఏఆర్‌డబ్ల్యూపీసీ, డి. పద్మలత తదితరులు పాల్గొన్నారు.

# 420 అడుగుల ఫ్లెక్సీ తో బీఆర్ఎస్ నిరసన

* ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?
* మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మెదక్ పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మెదక్ హెడ్ పోస్టాఫీసు వద్ద అంబేద్కర్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అమలు కాని హామీలు 420 అడుగుల పొడవైన ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు, దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. యూరియా కోసం ఆన్‌లైన్ విధానాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రైతు కళ్లల్లో కన్నీళ్లు కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా జరగలేదని, రైతుబంధు, రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరెళ్ళ మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ, ఆంజనేయులు కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్ దీపక్, బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి, కుమార్ సోహెల్, హవేలి ఘనపూర్, శంకరంపేట ఆర్ మండలాల పార్టీ అధ్యక్షులు, రామాయంపేట మాజీ ఎంపీపీ పుట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జన్నారంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదినం సందర్భంగా బుధవారం రోజున జన్నారం ప్రభుత్వ ఆసుపత్రిలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు మూగల వెంకటేష్‌తో పాటు జనసేన పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ గారి అభిమానులు కొమురవెల్లి సుందిల్ స్వరాజ్, బండారి సంజీవ్, శేఖర్, సిద్ధు, సుజిత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పకడ్బందీగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీసర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో సర్వే కొనసాగుతుందని, పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, డిస్టిక్ కలెక్టర్ స్నేహ శబరిష్, బుధవారం జిల్లాలోని తొర్రూరు మండల కేంద్రంలో రీ సర్వేకు ఎంపికైన జమిస్తాన్పురం, కానాపురం, వెంకటాపురం, కర్మాల, గోపాలగిరి, మడిపల్లి ( 6) గ్రామాలలో బుధవారం జమస్తాన్పూర్ లో జరుగుతున్న రీసర్వేలు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో (190) ఎకరాల పట్టా భూములను సర్వే చేయడం జరిగిందని, జులై 10 నుండి సర్వే కొనసాగుతుందని, లక్ష్యం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అనంతరం తొర్రూరు తహసిల్దార్ కార్యాలయంలో 22ఎ, పై నిషేధిత జాబితాలో వ్యవసాయతర భూముల ను సక్రమంగా గుర్తించాలని, భూ సమస్యలకు సంబంధించి రికార్డులలో ఎక్కడైనా వ్యవసాయ తర భూముల ప్రభుత్వ కార్యాలయాలు స్కూలు సబ్ స్టేషన్ తదితర అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ సూచించిన ప్రకారం 22 ఏ, ను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు, కార్యాలయ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందించాలని సూచించారు, ఈ పర్యటనలు కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పార్దివ దేహానికి నివాళులర్పించిన నోపా జిల్లా కన్వీనర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఈదుల పూసపల్లి గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం కుల పెద్ద జంపాల రామదాస్ మృతి చెందారు. వారి స్వగృహంలో పార్థివదేహాన్ని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, బాధ్యులు సందర్శించి నివాళులర్పించారు. రామదాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ గజవెల్లి వెంకన్న, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ కొమరగిరి సుమన్, నంద్యాల నరసింహారావు, ఖమ్మం శ్రీనివాస్, నిడిగొండ సత్యం, ఉల్లెందుల కనకయ్య, కుమ్మరికుంట నాగన్న, జంపాల దర్గేష్, జంపాల గోపి, తక్కెళ్లపల్లి మురళి, ఉబ్బలపల్లి అంజయ్య, హరీష్, జంపాల ఉపేందర్, జంపాల శ్రీను, తోట. కృష్ణ, శ్రీనివాస్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, ఎలమందల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తాం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎం పీ యు పి ఎస్ సింగారం పాఠశాలలో సింగారం గ్రామానికి చెందిన రవిశ్రావణి దంపతులు 5000 రూపాయల విలువైన నూతన క్యాలెండర్లు అందించడం జరిగింది. వారికి పాఠశాల తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు ధీటుగా, మన సింగారం పాఠశాల ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, పాఠశాల మీద ప్రేమతో ప్రభుత్వ విద్యార్థులు దేనికి తీసిపోరని, నూతన క్యాలెండర్లు ఇవ్వడం జరిగింది అన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, దాతలు ఇంకా ముందుకు వచ్చి మన పాఠశాల అభివృద్ధిలో భాగం పంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వినయకుమార్ అధ్యక్షత వహించగా, పాఠశాల ఉపాధ్యాయ బృందం డి.నరేష్, పి.శ్రీనివాసులు, అంగన్వాడి టీచర్, కె.పద్మ, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచాలి

* బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



ప్రజా స్ఫూర్తి, పాలేరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవచ్చిన ఫ్రేంవర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ పైన పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ మండల అధ్యకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏ.డీ.ఏ రాజేశ్ కి మరియు ఏ.ఓ వాణీ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి వారితో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఎఫ్ ఎఫ్ స్ యాప్ పైన కొంత అవగాహన లోపం వలన రైతులు తమ వ్యవసాయ పంటల అవసరాల కోసం యూరియా మరియు ఎరువులు కొనుగోలు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, వారి కోసం ప్రత్యేకంగా ప్రతి గ్రామంలో లేదా క్లస్టర్ పరిధిలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని, సమావేశాలు ఏర్పాటు గురించి రెండూ లేదా మూడు రోజులు ముందుగానే మీడియా, ఊరి చాటింపు మరియు సోషల్ మీడియా ద్వారా రైతులు అందరికీ పూర్తి స్థాయిలో సమాచారం అందించి యాప్ పట్ల అవగాహన కల్పించాలని కోరడం జరిగింది. అదేవిధంగా కొద్ది మంది ఏ.ఈ. ఓ లు తమ క్లస్టర్ పరిధిలో రైతులకు అందుబాటులో లేకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని కావున అందరినీ కూడా పూర్తి స్థాయిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు ఇబ్బందులు పడకుండా చేసే విధముగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. యూరియా, డీ ఏ పి కొరత లేకుండా చూడాలని, ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి, మందులు అందుబాటులో ఉంచి, రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేయడం జరిగినది. కార్యక్రమం లో జిల్లా యువజన నాయకులు మంద చంద్రశేఖర్ గౌడ్, మంద నవ్య తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

* ప్రజా సంక్షేమం మరిచిన పాలకులు...
* పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ.. ఎన్నికల్లో 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ, 1000 రోజులైనా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు కేవలం ఓట్ల కోసం వేసిన నాటకాలని తేలిపోయిందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో పాలేరు గడ్డపై నుంచి ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేల్పుల వీరయ్య, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షుడు బాసిబోయిన వీరన్న, నేలకొండపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బ్రాహ్మయ్య, నియోజకవర్గం లోని బీఆర్ఎస్ సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం ప్రయాణీకులకు స్వల్ప గాయాలు

* స్టీరింగ్ రాడ్ ఊడిపోవడమే కారణం.



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి: హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గురువారం సుందరగిరి గ్రామ శివారులో ప్రమాదానికి గురైంది. నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు జరుగుతుండటంతో పాటు బస్సులో సామర్థ్యానికి మించి దాదాపు 50 మంది ప్రయాణికులు ఉండటంతో ఒక్కసారిగా బస్సు ఎగిరిపడింది. ఈ క్రమంలో స్టీరింగ్ రాడ్ ఉన్నపళంగా ఊడిపోవడంతో బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి రహదారి పక్కనే ఉన్న స్థానిక రైతు కావటి బక్కయ్యకు చెందిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారని స్థానికులు తెలిపారు. బస్సులోని ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాకుండా కేవలం స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద శబ్దం విన్న వెంటనే గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రయాణికులను బస్సులో నుంచి బయటకు తీసి ఉపశమనం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు. ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వివరాలు తెలియాల్సి ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

: బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బిఆర్ఎస్ హుజూర్నగర్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు. మండలంలోని కల్మలచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ హరిహరసుత శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఆలయంలో నెలకొన్న నీటి కొరతను కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు . ఆలయ ప్రాంగణంలో భక్తుల తాగునీటి, ఆలయ అవసరాల కోసం నూతన బోర్ ఏర్పాటుకు చేయూత అందించారు. అంతకుముందు ఆలయంలో గణపతి పూజ, భూమి పూజ, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ఇచ్చిన హామీ మేరకు బోరు పనులను ప్రారంభించారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన రఘుకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు పూలమాలలు శాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీనివాస్ టిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ వెంకటరమణారెడ్డి దస్తగిరి, హుజూర్నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

* అదనపు కలెక్టర్ భాస్కరరావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: బుధవారం గుండాల మండలం రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. చిన్నారుల తో ముచ్చటించారు. వ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనంతరం రామారం గ్రామంలో నిర్మిస్తున్న ఫారం పాండ్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఫారం పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి నీటి లభ్యత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఫారం పాండ్ పనులు చేపట్టాలని సూచించారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో ఎంపీడీవో, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నవాబుపేటలో మిన్నంటిన కాంగ్రెస్ 1000రోజుల సంబరాలు



చిగురుమామిడి/ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నవాబుపేట గ్రామంలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ, బాణసంచా కాలుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు అందే సురేష్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కొనియాడారు. గత వెయ్యి రోజులుగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశంలో హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మండల అధ్యక్షుడు అంది సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి, సాంబారి బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్ రెడ్డి, కాంతాల మహిపాల్ రెడ్డి, పూల లచ్చిరెడ్డి, ఎస్కే షాబుద్దీన్, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు పశ్చిమ అజయ్ కుమార్, ఠాకూర్ నరేందర్ సింగ్, మాడ శ్రీనివాస్, సుద్దాల ప్రవీణ్ కుమార్, ఎనగందుల లక్ష్మణ్, బోయిని వంశీకృష్ణ, గుడిసె మల్లికార్జున్, ఠాకూర్ దిలీప్ సింగ్, కంది నాగరాజు, ఠాకూర్ రానా ప్రతాప్ సింగ్, వర్కోలు సంతోష్ కుమార్, కూరెళ్ళ కిషోర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంబరాలను విజయవంతం చేశారు.

# బీఆర్ఎస్ సమరభేరి.. కాంగ్రెస్ హామీలపై నిరసన




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ 1,000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం భూపాలపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో సమరభేరి కార్యక్రమాలు నిర్వహించారు. భూపాలపల్లి అంబేద్కర్ చౌరస్తాలో 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన, రాస్తారోకో, బాకీ కార్డుల పంపిణీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజులు పూర్తయినా అనేక హామీలను నెరవేర్చలేదని నాయకులు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, రూ.500కే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, భృతి వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతులకు రూ.41 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి అరకొరగా అమలు చేశారని ఆరోపించారు.

# ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి: మహదేవపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఫైర్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నూతన భవనాలను పరిశీలించారు. మౌలిక వసతులు, పార్కింగ్ సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫైర్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్.. అత్యవసర సమయాల్లో ఫైర్ ఇంజన్లు, విపత్తు నిర్వహణ వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ప్రాంగణం, పార్కింగ్ సౌకర్యాలను అనువుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ విద్యాసాగర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, అగ్నిమాపక అధికారి నాగరాజు, డీటీ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల అభివృద్ధి సంరక్షణకు అంకురా–న్యూ హొరైజన్స్ భాగస్వామ్యం

* **గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలో న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ల ప్రారంభం**

హైదరాబాద్ , ప్రజాస్ఫూర్తి: హైదరాబాద్‌లో చిన్నారులకు సమగ్ర బాలల అభివృద్ధి సేవలను మరింత చేరువ చేసేందుకు అంకురా హాస్పిటల్స్ ఫర్ ఉమెన్ & చిల్డ్రన్, న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ భాగస్వామ్యాన్ని ప్రారంభించాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలోని అంకురా హాస్పిటల్స్ యూనిట్లలో న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను అంకురా హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం, న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ సమీర్ హెచ్. దల్వాయి లతో కలిసి అల్లు స్నేహా రెడ్డి ప్రారంభించారు. ఈ భాగస్వామ్యం ద్వారా అంకురా హాస్పిటల్స్‌కు చెందిన సమగ్ర వైద్య సేవల వ్యవస్థ, న్యూ హొరైజన్స్‌కు చెందిన బాలల అభివృద్ధి రంగంలోని ప్రత్యేక నైపుణ్యం ఒకే వేదికపైకి రానుంది. నవజాత శిశువులు, చిన్నారులు, కౌమారదశలో ఉన్న పిల్లలకు అభివృద్ధి, ప్రవర్తన, భావోద్వేగం, కమ్యూనికేషన్ తదితర అంశాల్లో అవసరమైన ప్రత్యేక సేవలు అందుబాటులోకి రానున్నాయి.న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ 2003లో ముంబైలో ప్రారంభమై, బాలల అభివృద్ధి రంగంలో ప్రత్యేక సేవలను అందిస్తూ ముందుకు సాగుతోందన్నారు.. ఆన్‌లైన్ ద్వారా కూడా సేవలను అందిస్తోందని. ఆటిజం, ఏడీహెచ్‌డీ, సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, అభ్యసన సమస్యలు, ఇతర న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలు ఎదుర్కొంటున్న పిల్లల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలను సంస్థ నిర్వహిస్తోందన్నారు.

**వివిధ విభాగాల నిపుణులతో సేవలు**

గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్లు, ఆక్యుపేషనల్ థెరపిస్టులు, ఫిజియోథెరపిస్టులు, క్లినికల్, కౌన్సెలింగ్ సైకాలజిస్టులు, ప్రత్యేక విద్యా నిపుణులు, స్పీచ్, లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ థెరపిస్టులు సేవలు అందించనున్నారు. పిల్లల అభివృద్ధి అవసరాలను ముందుగానే గుర్తించడం, వారి సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం, తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

* **పిల్లలకు సరైన సమయంలో సరైన సేవలు అందాలి: డాక్టర్ కృష్ణ ప్రసాద్**

అంకురా హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం మాట్లాడుతూ ప్రతి చిన్నారికి సరైన సమయంలో సరైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. పిల్లల శారీరక ఆరోగ్యంతో పాటు వారి అభివృద్ధి, భావోద్వేగ అవసరాలను కూడా సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు, డైరెక్టర్, డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ సమీర్ దల్వాయి మాట్లాడుతూ ముంబైలో 24 సంవత్సరాలుగా బాలల అభివృద్ధి రంగంలో కొనసాగిస్తున్న తమ సేవలను హైదరాబాద్‌కు విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. భారతీయ కుటుంబాల అవసరాలకు అనుగుణంగా తమ 150 మంది నిపుణులతో కూడిన బృందం న్యూ హొరైజన్స్ డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్‌ను రూపొందించినట్లు తెలిపారు. అంకురా హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌లో మరింత మంది పిల్లలకు ప్రత్యేక సేవలు అందించే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై తమను ప్రోత్సహించిన అల్లు స్నేహా రెడ్డికి, భాగస్వామ్యానికి సహకరించిన అంకురా హాస్పిటల్స్‌కు డాక్టర్ సమీర్ దల్వాయి కృతజ్ఞతలు తెలిపారు.

**ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సేవలు**

గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలోని న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయి. హైదరాబాద్‌లో బాలల అభివృద్ధి సేవలకు ప్రాప్యతను మరింత పెంచడంతో పాటు, పిల్లలు, వారి కుటుంబాలకు సమన్వయంతో కూడిన వైద్య, చికిత్సా, అభివృద్ధి సేవలను అందించడంలో ఈ కేంద్రాల ప్రారంభం కీలక ముందడుగుగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# మిల్లర్లను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

* **బాయిల్డ్ రైస్ తీసుకోకపోవడంతో పేరుకుపోయిన నిలువలు**




ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ: 2014 నుండి 2025 వరకు సుమారు 9 కోట్ల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం నుండి మిల్లర్లకు కేటాయించారని ఇట్టి ధాన్యాలను మిల్లర్లు బియ్యంగా మార్చి 99% బాకీ ప్రభుత్వానికి సజావుగా అప్పగించడం జరిగిందని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్నాటి నారాయణ , జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో గత దశాబ్ద కాలంలో, భారత దేశంలోనే అత్యంత ఆధునిక ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో వందల సంఖ్యలో మిల్లులను ఏర్పాటు చేయడం జరిగిందని వీటి ద్వారా దేశంలోనే తెలంగాణ రైతులకు అత్యధిక దరలు లభించడం జరిగిందన్నారు. ప్రపంచ స్థాయి రైస్ మిల్లింగ్ పరిశ్రమ ద్వారా తెలంగాణ వినియోగదారులకు, భారతదేశం లోని ఇతర రాష్ట్రాలకు, అలాగే ఇతర దేశాలకు ఎగుమతి చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ధాన్యం పూర్తిగా పక్కదారి పట్టించి మోసం చేసిన మిల్లర్లను మా సంఘ సంభ్యత్వము నుండి బహిష్కరించి, ఈ సమాచారం ప్రభుత్వానికి అందించామని అటువంటి వారిపై చర్యలు తీసుకున్న మాకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. 202425 తరువాత ప్రభుత్వానికి ఎటువంటి బాకీ లేని మిల్లర్ల పై వెరిఫికేషన్ చేసే ఇబ్బంది పెట్టవద్దు. ఎఫ్ సి ఐ బి య్యం డెలివరీ చేస్తూ, వారి గోదాముల వద్ద స్థలం లేక డెలివరీలకు అంతరాయం కలుగుతున్న సందర్భం లో, బియ్యం డెలివరికి ఇంకా సమయం ఉన్న సందర్భం లో ఎటువంటి బాకీ లేని మిల్లులను వెరిఫికేషన్ చేయవలసిన అవసరం లేదని వారు తెలిపారు. రాబోయే ఖరీఫ్ 2627 లో రైతుల వద్ద సేకరించే వరి ధాన్యాన్ని మీ గోదాముల్లో నిలువ చేసుకొని, ప్రభుత్వానికి ఎలాంటి బకాయి లేని మిల్లర్లకు మాత్రమే దాన్యం కేటాయించగలరని అట్టి ధాన్యాన్ని మిల్లర్లు ప్రభుత్వ నిబందనల ప్రకారం బియ్యం అప్పజెప్పడం జరుగుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి ధాన్యం అధికంగా వచ్చిన సందర్భంలో ఇట్టి ధాన్యం ను ఏఎంసి గోదాముల్లో కిరాయి లేకుండా నిలువ చేసుకోవడానికి మిల్లర్లకు జిల్లా యంత్రాగం అనుమతి ఇవ్వాలని వీటికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు , ఎగ్జిక్యూటివ్ నెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి , గౌరవ అధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి , జాయింట్ సెక్రటరీ కండె రామకృష్ణ , చిట్యాల సెంటర్ అధ్యక్షులు తేరేటిపల్లి హనుమంత్ , జనరల్ సెక్రటరీ పోల పెద్దయ్యా , నకిరేకల్ అధ్యక్షులు కన్మంత రెడ్డి కేశవరెడ్డి , జనరల్ సెక్రటరీ తొనుపునూరి వెంకటేశ్వర్లు , దేవరకొండ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు , జనరల్ సెక్రటరీ శిల శ్రీనివాస్ , నల్లగొండ అధ్యక్షులు వీరుమల్ల శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ తేలుకుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి

* **తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి: ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆయన సందర్శించారు. చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలను రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని, రోగుల చికిత్సలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. రోగుల ఆరోగ్యంతో చెలగాటమాడితే తమ పార్టీ సహించబోదని హెచ్చరించారు. గతంలోనూ ఆసుపత్రి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సమస్యలు పరిష్కరించే వరకు ప్రజలు, రోగుల తరఫున పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మడే సంతోష్, లక్పతి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన నాంపల్లి శ్రీ హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గం



నాంపల్లి, ప్రజా స్ఫూర్తి : ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్నీ రకాల సౌకర్యాలు కల్పించేందుకు శాయశక్తులా తమ వంతు కృషి చేస్తామని నాంపల్లి గూడ్స్ షెడ్ లోని శ్రీ హనుమాన్ దేవాలయ ట్రస్టు బోర్డు పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయానికి నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా చల్లపల్లి శ్రీ రామచంద్రమూర్తి, సభ్యులుగా ప్రవీణ్ పిల్లే, పిల్లి గురుమూర్తి, కాటెపాగ అనిల్ బాబు, కందికంటి సంధ్యారాణి లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సమాజంలో భక్తి భావం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. తమను పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఫిరోజ్ ఖాన్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్, సహాయ కమిషనర్ కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ సురేఖ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# పుష్కరాల నాటికి కాళేశ్వరం ఆలయ పనులు పూర్తి చేయాలి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి: గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం దేవాలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ అధికారులు, సివిల్, స్టోన్ వర్క్ కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ పురాతన నిర్మాణాల పరిరక్షణతో పాటు చారిత్రక ప్రాధాన్యత, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ రమేష్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, దేవాలయ ఈఓ మహేష్, ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్‌లోగా భూ రీసర్వే పూర్తి చేయాలి

* **మందకొడిగా సాగితే చర్యలు తప్పవు: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజా స్ఫూర్తి:జిల్లాలో కొనసాగుతున్న డిజిటల్ భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, మొదటి విడతను నవంబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం మండలం ధన్వాడలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. రైతులకు నోటీసుల జారీ, సర్వే బృందాల పనితీరు, ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే తీరును తెలుసుకున్నారు. జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి మండలంలో పనులు ప్రారంభించి వేగం పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే బృందాల సంఖ్య పెంచడంతో పాటు రోవర్ పరికరాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 97 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. 54 మంది విధులకు హాజరు కావడం లేదని ఏడీ కుసుమకుమారి తెలపగా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. అయినా విధులకు హాజరుకాని వారి లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే డిజిటల్ భూ రీ సర్వే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచి సర్వే బృందాలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, సర్వే సిబ్బంది, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# నిరుపేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అలాంటి పాలనపై బిఆర్ఎస్ నిరసనలు వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అద్భుతంగా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకొని సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని దిగిపోవాలని నిరసనలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. 25 లక్షల పైగా రైతు కుటుంబాలకు రెండు లక్షల వరకు రుణ మాఫీ కల్పించామని,రైతు రుణమాఫి,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు ఉచితంగా బస్సు ప్రయాణం, , గృహ జ్యోతి పథకం కింద 53 లక్షల పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, 43 లక్షల కుటుంబాలకు 500 కే గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, మహిళా సంఘాలకు రుణాలు, తొలి విడుతలో 4.50 లక్షల ఇందిర ఇండ్లు అందించి ఇంటి నిర్మాణానికి 5 లక్షల చొప్పున గ్రేటర్ సిటీలో ఇందిరమ్మ టవర్స్ లక్షమందికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ప్రభుత్వం దిగిపోవాలా అని ప్రశ్నించారు. 72,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, సన్నబియ్యం అందించడంతో పాటు 15.46 లక్షల కొత్త రేషన్ కార్డులు అందించామన్నారు. కొత్తగా రేషన్ కార్డులు, అర్హులైన వారికి పెన్షన్ లు ఇచ్చామని తెలిపారు. చేపట్టిన నాటి నుంచి నేటి వరకు కెసిఆర్ కు ప్రతిపక్ష నాయకుడిగా నెలకు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రశ్నించే ముందు పదేండ్ల మీ మ్యానిఫెస్టోలో ఏం చేశారో చెప్పాలన్నారు. మూడేళ్లలో కెసిఆర్ మూడుసార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని ఆయన ఏది చెప్పాలనుకున్న అసెంబ్లీకి వచ్చి చెప్పాలన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు కేసిఆర్ ప్రతిపక్ష పాత్రను సక్రమంగా పోషించాలని అన్నారు.

# లోన్ కల్యాణ్ మేళ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజా స్ఫూర్తి, బైంసా: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి చేయూత అందించే లక్ష్యంతో సెప్టెంబర్ 1 నుండి 30, 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్వనిధి ప్రచారం, లోక్ కళ్యాణ్ మేళా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘ పరిధులలోనూ, వివిధ బ్యాంక్ శాఖలలోనూ అర్హులైన వీధి వ్యాపారులకు బ్యాంక్ రుణాలు అందించడమే ధ్యేయంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ విస్తృత ప్రచారంలో భాగంగా బుధవారం నిర్మల్ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) శాఖలో ప్రత్యేక రుణ స్వీకరణ అవగాహన క్యాంపెయిన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ, వీధి వ్యాపారులు తమ దైనందిన వ్యాపారాలను మరింత విస్తరించుకోవడానికి అలాగే ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వనిధి పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అర్హత కలిగిన వ్యాపారి ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వీధి వ్యాపారుల నుండి స్వనిధి రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, వీలైనంత వేగంగా రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని బ్యాంకు ప్రతినిధులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (టిఎంసి) సావిత్రి, ఆర్‌పి శివకుమార్, బ్యాంకు మేనేజర్ జోషి, బ్యాంక్ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో వీధి వ్యాపారులు హాజరయ్యారు.

# సినిమా



## సంకల్ప సాధకుడు కల్యాణ్ బాబు

- **తమ్ముడికి బర్త్ డే విషెస్ తెలిపిన చిరు**

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి తమ్ముడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'సంకల్ప సాధకుడు కళ్యాణ్‌బాబు' అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ప్రజలకు మంచి చేయాలనే తపన, నిబద్ధత పవన్‌లో చిన్నప్పటి నుంచే ఉన్నాయని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణాభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల మౌలిక అవసరాల కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని చిరంజీవి ప్రశంసించారు. పిఠాపురం ప్రజలకు ప్రజాప్రతినిధిగా కాకుండా కుటుంబ సభ్యుడిలా అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే పవన్ భవిష్యత్ లక్ష్యాలను విజయ వంతంగా చేరుకోవాలని ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ మరింత శక్తితో ప్రజాసేవకు పునరంకితం కావాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చెర్రీ సరసన భాగ్యశ్రీ

లెనిన్ మూవీతో హిట్ కొట్టిన కథానాయిక భాగ్యశ్రీ బోర్సేకు మరో క్రేజీ అవకాశం దక్కనుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. రామ్‌చరణ్–సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రంలో కథానాయికగా ఆమె పేరును పరిశీలిస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. చరణ్‌కు జోడీగా భాగ్యశ్రీని తీసుకునే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. 'లెనిన్' తర్వాత వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. ఇప్పటి వరకు కొత్త చిత్రాలను ప్రకటించలేదు. కథ, పాత్ర విషయంలో ఆమె ఆచితూచి వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా, చరణ్–సుకుమార్ కలయికలో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబోలో రానున్న చిత్రంపై భారీ అంచనాలున్నాయి. భాగ్యశ్రీ ఎంపికపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం తమిళంలో సియాన్ మూవీలో శివ కార్తీకేయన్‌తో జతకడుతోంది.





## అస్వస్థతకు గురైన మమితా



యంగ్ హీరోయిన్ మమితా బైజు అస్వస్థతతకు గురైంది. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులతో ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నది. దాంతో ఆమె ఆస్ట్రేలియా పర్యటన రద్దయ్యింది. ఈ నెల 5న జరగాల్సిన 'లెండాక్సిస్ క్లైడ్ ఓనం 2026' వేడుకలకు మమితా ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. ఆమె అనారోగ్యం కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు క్లైడ్ మలయాళీ అసోసియేషన్ ప్రకటించింది. వైద్యులు పూర్తి విశ్రాంతి సూచించడంతో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చిందని మమిత పేర్కొంది. ఆస్ట్రేలియాలోని మలయాళీ సమాజాన్ని కలుసుకోలేకపోతున్నందుకు విచారం వ్యక్తం చేస్తూ.. నిర్వాహకులకు, కార్యక్రమానికి రావాల్సిన వారికి క్షమాపణలు చెప్పారు. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఇక మమితా నటించిన 'బెత్లహెమ్ ఫ్యామిలీ యూనిట్' ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'లోనూ ఆమె నటించగా.. ఈ చిత్రం రూ.100 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది.





## ముగ్గురు భామలకు కలిసిరాని టాక్సిక్

స్టార్ హీరో.. భారీ బడ్జెట్.. పాన్ ఇండియా రిలీజ్.. వెరసి 'టాక్సిక్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే రిలీజ్ తర్వాత ఈ సినిమా ముగ్గురు హీరోయిన్లకు మాత్రం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. కియారా అద్వానీ, నయనతార, తార సుతారియాలకు పెద్దగా కలిసిరాలేదనే చర్చ జరుగుతోంది. తల్లి అయ్యాక కియారా నటించిన తొలి చిత్రమిది. అంతకు ముందు ఆమె చేసిన 'గేమ్ ఛేంజర్', 'వార్ 2' ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయాయి. దీంతో 'టాక్సిక్'తో కమ్‌బ్యాక్ ఇవ్వాలని భావించినా.. ఆ ఆశలు ఫలించలేదు. ఇక తార సుతారియాకు 'టాక్సిక్'తో సౌత్‌లో అరంగేట్రం చేసింది. మంచి ప్రాధాన్యం దక్కడంతో కీలక పాత్రలో కనిపిస్తుందని భావించారు. కానీ సినిమాలో ఆమె పాత్ర పరిమితంగానే ఉండటంతో పెద్దగా గుర్తింపు దక్కలేదు. నయనతార యశ్ సోదరిగా కీలక పాత్రలో కనిపించింది. సినిమాతో నయన్‌కు పెద్దగా ఊరట దక్కలేదు. దీనికి తోడు కవిన్‌కు జోడీగా చేసిన 'హాయ్' కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. యశ్ సినిమాగా టాక్సిక్ అంచనాలు రేపినా.. ఇందులోని ముగ్గురు భామలకు మాత్రం నిరాశనే మిగిల్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.